# బాల వాఙ్మయం

- న్యాయపతి రాఘవరావు

తెనుగు బాలసాహిత్యం యొక్క పూర్వచరిత్రను గురించి నేను ఇప్పుడు ఇక్కడ విపులంగా చెప్పదలచుకోలేదు. ఎందుకంటే, అసలు పూర్వ చరిత్ర అంటే ఏమీ అట్టేలేదు గనుక.

నన్నయ తిక్కనాది కవుల రోజుల్లో తెనుగు భాషలో గొప్ప కావ్యాలు రచింపబడినవే గాని బాలల కొరకు ప్రత్యేకంగా వ్రాయబడిన రచనలేవీ కనబడవు. కాని అంతకు పూర్వమే, ఈ రచనలన్నిటికీ *బాలవాఙ్మయం* పుట్టిందని నా మనవి. ఆంధ్రావనిలో తెనుగు బాలల పుట్టుకతోనే *బాలవాఙ్మయం* పుట్టిందని చెప్పవచ్చును. ఏ తల్లో తన ముద్దు బిడ్డను ఉయ్యాలలో ఊపుతూ, కూనిరాగాలు తీస్తూ - *లాలి బంగారుబొమ్మ - లాలి మాయమ్మా* అంటూ ఒక జోలపాట అప్రయత్నంగా పాడి వుంటుంది.

ఏడుస్తూ వున్న పాపాయిని ఎత్తుకొని ఒక తల్లి - *ఏడవకు ఏడవకు వెర్రినా తండ్రీ ఏడుస్తే నీకళ్ళ నీలాలు కారూ* అనిన్నీ, ఇంకా ఏడుపు మానకుంటే ఆకాశం వేపు చూపి -

చందమామ రావే - రావే చందమామా
చందమామా రావే - జాబిల్లిరావే
కొండెక్కి రావే - కోటిపూలు తేవే
బండెక్కి రావే - బంతిపూలు తేవే

అంటూ లాలనగా ఒక గేయాన్ని పాడి ఉంటుంది.

ఈ విధంగా లాలిపాటలను, జలపాటలను మన తెలుగు తల్లులే కవితను అల్లి మొట్టమొదటి బాలవాఙ్మయాన్ని సృషించారేమో!

బాలలు పెరగ్గానే వారి వయస్సుకి అనుగుణంగా ఆటపాటలు కూడా మనకి తరతరాలుగా వచ్చాయి.

చమ్మచక్క - చారడేసి మొగ్గ
అట్టుపోయంగ-ఆరగించంగ - ఇంకా
విశాఖపట్నం వీశెడు బెల్లం
నీకో పదలం నాకో పదలం
పదలం పదలం పదలం
కళింగపట్నం కాసుల పేరూ
నీకో పేరూ నాకో పేరూ
భీమునిపట్నం బిందెల జోడూ
నీకో జోడూ నాకో జోడూ

ఇలాగ ఆడపిల్లలు ఆ రోజుల్లో పాడుకుంటూ, ఆడుకుంటూ ఉండేవారు.

కొంతకాలానికి మొగలాయి రాజ్యం వచ్చిన తరువాత మనకి రూపాయ్‌లూ, సీపాయ్‌లూ వచ్చాక,

గూట్లో రూపాయ్ - నీ మొగుడు సీపాయ్
సీపాయ్ సీపాయ్ సీపాయ్ - వంటి పాటలు వచ్చాయి.

తమాషాగా హాస్యానికి -

బాబా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
నులకా మంచం వేశారు
నూరు గుద్దులు గుద్దేరు

ఇటువంటి రసవంతమయిన పాటలు మన *బాలవాఙ్మయా*నికి అముద్రితంగా వచ్చాయి. ఈ సాహిత్యం ఫలానావారు రచించారని నిదర్శనాలు కనబడవు. కాని కవితా దృష్టితో చూస్తే ప్రతి ఆటపాటలోనూ, పల్లెపదంలోనూ తెలుగు భాషలోని తియ్యదనాన్నీ, యతిప్రాసల అందాన్ని ఈ గేయరచనలో చూడగలుగుతున్నాం. వేటూరి ప్రభాకరశాస్త్రి యీ పాత పాటలను కొన్ని సేకరించి తమ *బాల భాష* లో ఉపోద్ఘాతముగా ఇలా వ్రాస్తున్నారు.

*ఉన్నత కవితా వాహినికి బాలవాఙ్మయము ఆటపట్టని చెప్పవచ్చును.*

*ఆంధ్రభాషకు సహజాలంకారమైన యతిప్రాసములు, సంగీతచ్ఛాయ, బాలరచనములందు గానవచ్చుచున్నవి. అట్టి రచనములను బాలకులు పాలమీగడ చవితో జదువగలరు. ఈ ఇంపు నెరుగక పోవుటచే నిప్పటి బాల పాఠ్య గ్రంథ రచనలు–*

*ఇదిగో ఆవు; ఇది మంచి ఆవు; ఇది పాలు ఇచ్చును;*

*దీని పాలు తెల్లగా నుండును; ఆవుకు నాలుగు కాళ్ళు ఉండును; ఇత్యాది పొల్లు మాటలతో పాఠము లల్లి బాలకుల విసిగించు చున్నారు.*

వేటూరి వారి వ్యాఖ్య ముమ్మాటికీ నిజమనిపిస్తోంది. మహమ్మదీయ యుగంలో ప్రారంభమయిన చీకటి, బ్రిటిషు యుగంలో బాగా నలుదిశలా వ్యాపించింది. మన బాలలు ఆనాటి అవసరాలను బట్టి –

*ఇదిగో ఆవు; దీనికి నాలుగు కాళ్ళున్నవి; దీని పాలు తెల్లగా వుండును.* అని నేర్చుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనినే *వాచక సాహిత్య యుగం* అని చెప్పవచ్చును.

ఈ కాలంలో గేయరూపంలో వచ్చిన *శతక సాహిత్యం* తప్పిస్తే బాలల కొరకు ఇతర రచనలు కనిపించవు. ఈ శతకాలనే బాలలు కంఠస్థము చేస్తూ వుండేవారు. 1847లో *పెద్దబాలశిక్ష.* దాని తరువాత ఒక 100 సంవత్సరాలకు 1946లో మాగంటి బాపినీడు *తెలుగు తల్లి,* ఆ తరువాత మరో పదేళ్ళకు మహమ్మద్ ఖాసింఖాన్ *బాల విజ్ఞాన సర్వస్వము* ప్రచురింపబడినది.

చింతా దీక్షితులుగారు *తెలుగు తల్లి*కి వ్రాసిన తొలిపలుకులు ఇక్కడ అప్రస్తుతము కాదు. వారు ఇలా వ్రాశారు.

*తెలుగు పిల్లల్లారా! ఇంతవరకు (1946) మీరు చదువుకోవడానికి సరియైన పుస్తకాలు అట్టే తెలుగులో లేవు. మీరు చదువుతున్న వాచకాలు మీ పుస్తకాలు అనుకుంటారేమో! కావుసుమండీ! అవి గవర్నమెంటువారి కోసం అదో భాషలో వ్రాసిన పుస్తకాలు. పాపం మీ చేత బలవంతంగా చదివిస్తున్నారు. వాటిలో ఏ కొద్దిగానో మంచివి కూడా వుండవచ్చు. మీ కోసం మొన్న మొన్నటి వరకూ ఒక పత్రికకూడా లేదు...* అంటూ వ్రాశారు.

బాల సాహిత్యానికి పిల్లల పత్రికలు చేసిన సేవ తరువాత ప్రస్తావిస్తాను. అంతకు పూర్వమే, అంటే మొట్టమొదటి పిల్లల పత్రిక 1945లో ప్రచురించబడక పూర్వమే, కొందరు కవులు బాలలకోసం గేయాలు రచించారు.

వేంకట పార్వతీశకవులు *బాలగీతాలు* వ్రాసి ప్రకటించారు. కవి కొండలవారు *చిట్టికేత, చదువుల దుత్త* మొదలుగాగల గేయ రచనల సంపుటి ప్రకటించారు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు *మిణుగురు పురుగులు, పాలపిట్ట* లో మంచి గేయాలు వ్రాశాడు. గిడుగు సీతాపతి బాలలకోసం *రైలుబండి పాట, ఈగ–సాలీడు, చిలుకమ్మ పెళ్ళి* మొదలగు గేయాలూ, గేయకథలు వ్రాసి వాచకాల్లో ప్రచురించారు. వీరి గేయాలు బాలలు ఇష్టంగా పాడుకుంటున్నారు.

ఉదాహరణకు : *ఈగా–సాలీడు* సంవాదం యీ విధంగా సాగింది.

సాలీడు :
ఈగమ్మ ఈగమ్మ ఇంట్లోకి వస్తావా
ఈ ఇంటి చిత్రాలూ ఎచటైనా జూచావా
సుడిమేడ మెట్టెక్కి చుట్టూ తిరుగుతూ వచ్చి
సొగసైన గదిలోని చోద్యాలు చూస్తావా?
అప్పుడు ఈగ :
అబ్బబ్బ! నే రాను ! అబ్బబ్బ నే రాను
సాలెపురుగుల మేడ–చావ చంపెడు మేడ
ఎగిరి వెళ్ళిన వారు – దిగలేదు నీ మేడ
మేడ నెక్కగ నేల – చావు కోరడమేల?
ఇలాగ నడుస్తుంది.

అసలు బాలల మనస్తత్త్వాలు పూర్తిగా గ్రహించి బాలలకు అందుబాటులో వుండే సాహిత్యాన్ని సృష్టించినవారు చింతా దీక్షితులు. వారు బాలలో నొకబాలయై లక్క పిడతలతో ఆడారు; కథలు అల్లి చెప్పారు. వారి *సూరీ–సీతీ–వెంకీ* ప్రతి ఇంట్లోనూ ఉన్నారని పిస్తుంది. తెలుగులో మొట్టమొదటి బాలల నవల *లీలాసుందరి* దీక్షితులుగారే రచించారు. వారి *లక్క పిడతల*లోని పాటలు చాల మంది బాలలు ఇంటింటా పాడుకుంటారు. ఎంతటి పెద్ద విషయాన్నైనా బాలలకు తేలికగా అందజేయగలమని నిరూపించడానికి వారి *హనుమంతుని తోక* ఒక నిదర్శనము. ఈ గేయంలో వారు రామాయణ కథనంతా ఎంతో రసవంతంగా చిత్రించారు. వీరి రచనలు కూడా చాలా కాలం వరకూ వాచక పుస్తకాలలోనూ, *భారతి, గృహలక్ష్మి* పత్రికల్లోనూ ప్రచురిత మగుతూ వచ్చాయి.

**బాల సాహిత్యం–పత్రికలు :**

బాల సాహిత్య ప్రచారానికి ఎక్కువగా సహకరించినవి పత్రికలు. 1884లో మదరాసు నుండి వెలువడిన *జనవినోదిని* అనే పత్రికలో Some amusing rhymes of Ditties for girls అని పూర్వకాలపు ఆటలు ప్రచురించారు. ఈ శతాబ్దం ప్రారంభంలో బాల వాఙ్మయానికి కొద్దో గొప్పో దోహదం

ఇచ్చిన పత్రికలు *గృహలక్ష్మి, భారతి* కాని 1945లో ***బాల*** పత్రిక వచ్చేవరకూ పిల్లలకోసం ప్రత్యేకంగా ప్రచురింపబడిన పత్రిక అంటూ లేదు. ***బాల,*** బాల ప్రపంచంలో ఒక నూతన చైతన్యం కలిగించిందని చెప్పక తప్పదు. *బాల* తెలుగు బాలలో నొక బాలయై వాళ్ళతో నేస్తం కట్టింది; కొత్త కథలు చెప్పిది; పాటలు పాడించింది; నాటకాలు ఆడింది; బొమ్మలతో కథలు చెప్పింది; వింతలూ, వినోదాలు, విజ్ఞాన విషయాలు చేకూర్చింది. పొడుపు కథలూ చిక్కు ప్రశ్నలూ వేసింది. *బాల* బాల సాహిత్యంలో నూతన పోకడలకు దారి చూపింది.

*బాల* పుట్టిన తరువాత బాలకు ఎందరో చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ పుట్టారు. *చందమామ, బాబు, పాపాయి, బాలవినోదం, బాలబంధు, పొట్టిబావ, తాత, జాబిల్లి, బాలప్రభ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బాలానందం* – ఇలాగ ఒక డజనుకుపైగా మనకి పిల్లల పత్రికలు వచ్చాయి. ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క విధంగా సేవచేస్తూ వచ్చింది. చాలా పత్రికలకు బాలారిష్టాలు తప్పలేదు. కాని బాల సాహిత్యాన్ని కంటికి మెదడుగా ఇంపుగా బాలల చేతులలో పెట్టి, బాల సాహిత్యంలో అభిరుచిని కలుగచేసినవి *బాల, చందమామ* అని చెప్పాలి. అయితే పాశ్చాత్య దేశాలలో ప్రచురింపబడుచున్న పిల్లల పత్రికలను చూస్తే మనం ఇంకా ఎంత వెనుకబడి వున్నామో తెలుస్తుంది. రంగులూ హంగులూ అటుంచి అసలు పిల్లల పత్రికలలో మనం వాడుతున్న భాషకూడా ఎంతవరకు పిల్లలకు అర్థం అవుతుందో కూడా చూడాలి.




బాల పత్రికల సంపాదకులకు, రచయితలకు ఒక చిన్న ఉదాహరణ: ఒక పిల్లల పత్రికలో ప్రచురితమైన యీ వాక్యాలు చూడండి: *ప్రపంచ విజేతగా సుప్రతిష్ఠితుడౌదామన్న కాంక్షతో పురోగమించిన గ్రీకు దేశాధిపతి అలెగ్జాండరు భారతభూమిలో పురుషోత్తమునితో ప్రతిఘటించి, పరాజితుడై తిరోగమించారు.*

ఇది చదువుతూ వుంటే, క్లాసులో వాచక పుస్తకం చుదువుతున్నట్టుంది గాని, పిల్లల పత్రిక చదువుతున్నట్లు లేదు.

ఏది ఎలా వున్నా, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పిల్లల పత్రికలు వెలవడ్డాక బాల సాహిత్యానికి మంచి రోజులు వచ్చాయనే చెప్పాలి. పాత బాల పత్రికలు తిరగేస్తే అందులో చింతా దీక్షితులు, పాలంకి రామచంద్రమూర్తి, అడపా రామకృష్ణా రావు, కవికొండల వెంకటరావు, వేలూరి శివరామ శాస్త్రి, రజని, శ్రీవాస్తవ, జనమంచి, శ్రీశ్రీ, ఆరుద్ర, వసంతరావు వెకంటరావు, ముళ్లపూడి వెంకటరమణ మున్నగు వారి రచనలు: బాపూ, బుజ్జాయి, వడ్డాది పాపయ్య మున్నగు చిత్రకారుల బొమ్మలు కనపడతాయి. పిల్లల పత్రికలను బాలలు ఎంతో ఉత్సాహంతో చదవడం చూచి, ఇదివరలో బాలసాహిత్యాన్ని ప్రచురించుటకు భయపడ్డ పుస్తక వ్యాపారస్తులు ముందుకువచ్చి రచయితలను ప్రోత్సహించి రకరకాల పుస్తకాలను ప్రచురించారు.

*బాల గేయాలు, గేయ కథలు, బాల రామాయణాలు, బాల భారతాలు, బాల భాగవతాలు, బాల కాశీమజిలీ కథలు, బాల కృష్ణలీలలు, బాల హితోపదేశ కథలు, బాల ప్రపంచ కథలు, బాల నాటికలు, బొమ్మల కథలు, విజ్ఞాన కథలు, జీవిత కథలు* బాల ప్రపంచంలో వెల్లివిరిశాయి.

**గేయ రచనలు :**

బాలలకోసం చక్కని గేయ రచనలు వ్రాసిన వారిలో వేంకట పార్వతీశ కవులు, గిడుగు వేంకట సీతాపతి, చింతా దీక్షితులు, రజనీ కాంతరావు, బి.వి.నరసింహారావు, దాశరథి, నారాయణ రెడ్డి, రాఘవ రావు, కవిరావు, అలపర్తి వెంకటసుబ్బారావు, నార్ల చిరంజీవి, ముళ్ళపూడి వెంకటరమణ, వేజండ్ల సాంబశివ రావు, పైడిపాటి సుబ్బరామయ్య, ఎల్లోరా మున్నగువారి పేర్లు చప్పున స్ఫురిస్తాయి.

ఈ గేయ రచనలు పరిశీలించి చూస్తే వృత్తాలు, తేటగీతలు, ఆట వెలదుల రూపంతో వచ్చినవి బాలలను ఎక్కువగా ఆకర్షించినట్లు, కనపబడదు. తాళ లయబద్ధంగా

పాడుకునేందుకు వీలుగా వున్న గేయాలు, గేయకథలు బాలల మన్ననలను పొందగలిగాయి.

జేజి మామయ్య (రజని) వ్రాసిన ఈ పాట వినండి :

ఆటలు ఆడి పాటలు పాడి – అలసి వచ్చానే
తియ్యాతియ్యని తాయిలమేదో – తెచ్చి పెట్టమ్మా

కుక్కాపిల్లా తోకాడిస్తూ గుమ్మా మెక్కింది
పిల్లీ పిల్లా కళ్ళూమూసి పీటా ఎక్కింది
కదుపూలోని కాకిపిల్లా గంతులేస్తోంది
తియ్యాతియ్యని తాయిలమేదో తెచ్చి పెట్టమ్మా

ఇటువంటి గేయాలన్నీ చేర్చి రజనీ కాంతరావు ఒక చక్కని బాల గేయాలసంపుటి ప్రకటించారు.

బి.వి. నరసింహారావు *పాలబడి పాటలు, బాలరసాలు* లో తియ్యని నిమ్మ తొనలు బోలెడు దొరకుతాయి.

జూలుగుర్ర మొక్కటుంది
చాలు నా కింకేమి వద్దు
జీను వేసి కళ్ళెముంచి
నేను స్వారి చేతు దాని — *ఇదొకటి.*

పాపా పాపా నాన్నొస్తారు
పళ్ళూ బిళ్ళలు కొనితెస్తారు
అల్లరి మానితే అన్నీ నీకే
అల్లరి చేస్తే అన్నీ నాకే — *ఇదొకటి.*

ఇటువంటివి నరసింహారావు ఎన్నో గేయాలు వ్రాసి బాల సాహిత్యానికి ఎంతో సేవ చేశారు.

**గేయ కథలు :**

గేయాలన్నా గేయ కథలు బాలలకు ఇష్టం. బాలగేయ కథలను వ్రాసిన వారిలో కవిరావు, అలపర్తి, ముళ్ళపూడి మొదలగు వారి రచనలు వ్యాప్తంగా వున్నవి. కవిరావు బొమ్మరిల్లు, ఇతర గేయ కథల సంపుటములను చక్కగా అచ్చొత్తించి అందజేశారు. వీరు రవీంద్రుని గేయాలను కూడా అనువదించి *నెలవంక*ను ప్రచురించారు.

గేయకథలను వ్రాసిన వారిలో చాలామంది వాడుకలో వున్న నీతి కథలను, యుక్తి కథలను కథా వస్తువుగా తీసికొని గేయ రూపంలో వ్రాశారు.

కొందరి రచనలలో అక్కడక్కడ బాలలు చదువకూడని కథలూ, నీతులూ కూడా పొరపాటున ప్రచురింపబడుతున్నాయి. బాల సాహిత్యంలో కథా వస్తువు చాలా ముఖ్యమయినది. ఒకానొక గేయ కథలో యీ నీతిని ప్రబోధిస్తూ పడింది.

నీకు తోచిన రంగు – నీవు వేయక యున్న
మాటిమాటికి రంగు మార్చుచుండక యున్న
జగతిలో నీవింక జీవించుటే సున్న.

కథా వస్తువు ఎటువంటిదైనా, అంటే ఎంతక్లిష్టమైనదైనా, బాలలకు అర్థమయ్యేటట్లు చెప్పవచ్చును అని నిరూపించడానికి వసంతరావు వెంకటరావు స్పుట్‌నిక్ వంటి గేయం చంద్రుని గురించి వ్రాశారు.

**ఈ సైన్సు పాట వినండి :**

చందమామ చందమామ చందమామ
మందగమన మెందుకోయి చందమామ
భూగోళము నుండి పుట్టి
భూమిచుట్టు తిరుగుచుండి
భూగోళపు చీకట్లను
పోగొట్టగ వెన్నెలిచ్చు ॥చం॥
నీలో గాలైన లేదు
నీలో నీరైన లేదు
నీలో తిండైన లేదు
నీలో నిప్పయిన లేదు
నీ లోకంలో బ్రతుకుట
కాధారం బేమి లేదు
తీరా నిను చేరిన ఏ
తీరున జీవింపగలమొ ॥చం॥
అగ్గిపుల్ల వెలిగించిన
భగ్గున మంటలు రావట
ఎంత గొంతు చించుకున్న
సుంతయు వినిపించదట ॥చం॥

కృష్ణశాస్త్రి, దాశరథి, నారాయణ రెడ్డి, శ్రీశ్రీగారు కూడా బాలలకు గేయాలు, గేయ కథలు వ్రాశారు. కొన్ని మచ్చు తునకలు అప్రస్తుతము కాదనుకుంటాను.

**కృష్ణశాస్త్రి *వినాయకుడి* మీద వ్రాసిన పాట :**

బలే ఎలకు సవారీ – ఎలా ఎక్కుతావు
చలో అంటు ప్రతీ ఇంట ఎలా తిరుగుతావు
ఏదీ మాకు చూపించు – ఏనుగు మొగము
ఏదీ చంద్రవంక వంటి ఏకదంతము
ఇదే వచ్చె నీ గుర్రం – ఎలా ఎక్కుతావో
కదల్నీని బొజ్జ నీవు – కదం తొక్కుతావో
తినాలంటె కజాయాలు – తియ్యని అప్పాలు
బనాయించి పోవచ్చు – పంచదార పాలు
క్షణం వుండు మా ఇంట్లో అదే కోటివేలు
ధనాలొద్దు, వరాలొద్దు, దయవుంటే చాలు.
సరేగాని, వినాయకా – చదువు సంధ్యలుంటాయ్
మరీ మరీ పనులుంటై – మంచి ఆటలుంటాయ్
మరోసారి మనవులివే – మాకు అడ్డురాకు
భరాయించుకోలేము – పసివాళ్ళం బాబు.
ఫలం ఇచ్చుకుంటాము – పత్తి రిచ్చుకుంటాము.
తలోపూలు కాళ్ళకాడ – దాఖలు చేస్తాము
అలాకాదు తెమ్మంటే – అమ్మనడిగి తెస్తాం
పొలోమంటు పరిగెత్తి – బోలెడు ఉండ్రాళ్ళు.

**శ్రీశ్రీ కప్పవైద్యుడు గేయం :**

అనగా అనగా ఒక కప్ప / అది తానొక గొప్ప
వైద్యుడని భావించింది. / వైద్యం చేస్తానని చాటించింది
అడవికి వెళ్లిందా కప్ప / అమాంతంగా ఒక గొప్ప
వైద్యుడైనట్టు తన మెప్పు / చాటింది బెక బెక డప్పు

ఇలాగ ఆ కథ అంత్యానుప్రాసతో సాగుతుంది.

తెలంగాణ రచయితల సంఘం వారు ప్రచురించిన *చిరుగజ్జెలు,* అనే పుస్తకంలో నారాయణ రెడ్డి *తోట తల్లి* గేయ నాటిక ఇలా నడిచింది.

అదుగదుగో తోట తల్లి / మనపాలిటి పాలవెల్లి
రమ్మని పిలిచెను గదరా / రామూ సోమూ పదరా –

**రాము :**

తమ్ములార మనమంతా / తప్పక వెళ్ళాలిరా
ఆటలతో పాటలతో / పూటలు గడపాలిరా

**సోము :**

ముందు ముందుగా దాగుడు / మూతలె ఆడాలిరా
పిమ్మట పాటలతో తల / దిమ్మును వీడాలిరా!

**ఇలా నడిచింది కథ :**

దాశరథి గారి *వెన్నెల మడుగులు* ఇలా ప్రారంభ మవుతుంది:


మడుగులు మడుగులు – వెన్నెల మడుగులు
మెత్తని చుక్కలు ఎత్తిన గొడుగులు
కలువ పూవులకు విలువలు గూర్చిన
కర్పూరంతో కలసిన తొడుగులు –
జలధరం అనే రౌడి కుఱ్ఱాడు ప్రవేశించి –
అరె పిల్లలూ! ఇరే పిల్లలూ
ఒహో పిల్లలూ ఆహా పిల్లలూ
కన్నులు గానక వెన్నెలతోటి
ఎన్నినాళ్ళుగా ఆడేస్తున్నా రాహో...!
ఇదీ వరస.

**కథలూ – నవలలూ – నాటికలూ :**

బాల వాఙ్మయంలో గేయాలకంటే కథల పుస్తకాలే ఎక్కువగా ప్రచురింపబడినాయి. ఈ కథలలో అనువాదాలు ఎక్కువ. సొంత రచనలు తక్కువ. *కాశీ మజిలీలు, పేదరాశి పెద్దమ్మ కథలే* కాక, *విజ్ఞాన కథలు, సంస్కృత కథలు, బైబిలు కథలు, పంచతంత్ర కథలు, మహాపురుషుల జీవిత కథలు* ఇలా ఎన్నో రకాల శీర్షికలతో కథలు ప్రచురింపబడినాయి.

ఈ కథలు ప్రచురించడంలో ఎక్కువగా తెలంగాణాలో ఆంధ్ర సారస్వత పరిషత్తువారూ, కోస్తా జిల్లాలలో ఆదర్శ గ్రంథ మండలి, దేశి కవితా మండలి, సకల సాహితీ, బాల సాహితీ, బాల విజ్ఞాన విపంచిలాంటి సంస్థలు పాల్గొన్నాయి. రాయలసీమలో రాయలు కంపెనీ, బాల సరస్వతీ బుక్‌డిపోవారు కూడా బాల సాహిత్యాన్ని ప్రచురించారు. విశాలాంధ్ర, నవోదయ, దాచేపల్లి, కాళహస్తి, ఉమా పబ్లికేషన్సు మొదలగు సంస్థలు కూడా బాల సాహిత్య ప్రచురణకు పూనుకున్నాయి.

పాశ్చాత్య దేశాల్లో పిల్లల పుస్తకాలు రంగు రంగుల బొమ్మలతో, చక్కని అచ్చుతో ప్రచురిస్తారు. బొమ్మలతో కూర్చబడిన కథల పుస్తకాలు బాలలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. ఈ బొమ్మల కథలు పుస్తకాలు మన తెలుగు సాహిత్యంలో చాల తక్కువగా కనిపిస్తున్నాయి. బుజ్జాయి పబ్లికేషన్సు వారు యీ పనికి పూనుకొని కొన్ని పుస్తకాలు ప్రచురించారు. చక్కని రేఖా చిత్రాలు వ్రాసే యువకులు మనకి ఇంకా కావాలి.




ఆంధ్ర వారపత్రికలో పడిన నరసింహమూర్తిగారు బొమ్మల పంచతంత్ర కథలవంటి పుస్తకాలు కూడా కావాలి. యువ చిత్రకారుడు బాపూ కూడా బొమ్మల కథలను కొన్ని సృష్టించాడు. బాలలకు శాస్త్ర విజ్ఞాన విషయాలు సులభంగా బోధపడేటట్టు వాడుక భాషలో ఇటీవలనే విస్సా అప్పారావు గారు ఖగోళ విజ్ఞానం గురించి *ఆకాశం* అనే చక్కని పుస్తకం ప్రచురించారు. వేమరాజు భానుమూర్తి కూడా సైన్సు కథలు బోలెడు ప్రచురించారు.

**నవలలు**

బాల సాహిత్యంలో నవలా రచన కూడా ఆధునిక సాహిత్యంలో ఒక విభాగంగా వెలిసింది.

చింతా దీక్షితులుతో ప్రారంభమైన బాల నవలా రచన కె.సభా, పాలంకి రామచంద్రమూర్తి, నార్ల చిరంజీవి, శ్రీవాత్సవ, రావి కొండలరావు, కనకమేడల మొదలగు వారి చేతుల్లో పెరుగుతూ వచ్చింది. చింతా దీక్షితులు *లీలా సుందరి, శంపాలత, గోపి-మోహినీ,* కే. సభా *చంద్రం, మత్స్యకన్యలు,* చిరంజీవి *మందార మాల,* పాలంకి వారి *చిఱుకప్ప* రావి వారి *దాసు,* కనకమేడల వారి *అన్నదమ్ములు,* శ్రీవాత్సవ వారి *జల్తారు జాబిల్లి,* పిల్లల్ని ఎక్కువగా ఆకర్షించినట్లు తెలుస్తోంది.

**నాటికలు**

తెలుగు బాలల కొరకు నాటకములు, నాటికలు వ్రాసినవారు బహుతక్కువ. ఆకాశవాణి వివిధ కేంద్రాలలో పిల్లల కార్యక్రమములలో ప్రసార నిమిత్తము రేడియో అన్నయ్య, అక్కయ్యలు, సుభ, శ్రీవాత్సవ, పాలంకి, ఏడిద మొదలగువారు రచించిన రేడియో నాటికలే చాలా వరకు రంగస్థలముపై ప్రదర్శనకు అనుగుణ్యంగా మార్పులు చేసి ప్రచురణమైనాయి.

బాల సాహిత్య ప్రసారానికి ఆకాశవాణి మదరాసు, హైదరాబాదు, విజయవాడ కేంద్రాలు ఎంతో దోహదమిస్తున్నాయి. బాల గేయాలు, కథలు, రూపకాలు, రేడియో విజ్ఞాన యాత్రలు వ్రాయించి బాల వాఙ్మయంలో బాలలకు అభిరుచిని కలుగజేస్తున్నాయి. అంతే కాకుండా బాల జానపద గేయాలను, పాత కథలను, పాటలను సేకరించి, టేపు రికార్డు చేసిరేడియో గ్రంథాలయాన్ని సృష్టిస్తున్నాయి. అముద్రిత రేడియో నాటికలు వందల కొలది రేడియో కేంద్రాలలో ఉన్నాయి.

బాలల కొరకు రేడియో నాటికలేకాక విడిగా రంగస్థల నాటికలు కొన్ని కె.సభా, ఇల్లిందల సరస్వతీదేవి వ్రాసి ప్రచురించారు. కృష్ణకవి బాలకృష్ణుని లీలలు నాటికలుగా వ్రాశారేకాని అవి చదువుకునేందుకే బాగున్నాయి.

ఇప్పటివరకు ప్రచురింపబడిన నాటికలు 12,13 ఏళ్ళ వయస్సు పైబడ్డ బాలబాలికల కొరకే అనిపిస్తుంది. చిన్నారి బాలలకు ప్రదర్శనయోగ్యంగా Ballet వంటి మూకీలు మనకి ఇంకా కావాలి. రామాయణం, మహాభారతం, మొదలయిన కథలను చక్కని గేయ నాటికలుగా చిన్నారి పిల్లలచేత వేయించవచ్చును. అంతేకాదు, పంచతంత్రములోని హితోపదేశ కథలు చిట్టి బాలలకు వేషాలు వేయించి ప్రదర్శించ వచ్చును. అట్టి నాటికలలో చెప్పుకోతగినవి *పిల్లి మెడలో గంట, అపాయంలో ఉపాయం.*

**బాలసాహిత్యం - ప్రభుత్వం**

*నేటి బాలలే రేపటి పౌరులు* అని గుర్తించి మన ప్రభుత్వం బాల సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర స్థాయిలోనూ, తెలుగు భాషా సమితి ద్వారానూ, కొన్ని బహుమతులను ఏటేటా ఇస్తోంది. బాల రచయితల కార్ఖానా అని ఒక బడినిపెట్టి రచనలను పురుగొల్పింది. కాని యీ ప్రయత్నాలు చాలవు. బాలసాహిత్యం ఎక్కువగా, రసవంతంగా సర్వాంగ సుందరంగా వెలువడాలంటే దానికి ఒక సమగ్ర పథకం కావాలి. మి

# బాల నాటకరంగం

మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక కొన్ని నాటక సమాజాలు పిల్లలచేత *కృష్ణలీలలూ, ప్రహ్లాద* మొదలైన నాటకాలు వేయిస్తూ వచ్చారు. గుంటూరు బాలమిత్ర సభ, కాకినాడ యంగ్‌మెన్సు హ్యాపీక్లబ్బు, చిత్తూరు రామ విలాస సభ పిల్లల చేత నాటకాలాడించడం నాకెరుక. సూరిబాబూ, రఘురామయ్య మొదలైన నటులు మొదట్లో బాల నటులుగా పేరు తెచ్చుకున్నవారే. నేడు పేరుగన్న భానుమతి మొదలగు కొందరు సినీ తారలు మొదట బాలనటీమణులుగా అనుభవం సంపాదించిన వారే.

ఆ విధంగా కొన్ని నాటక సమాజాలు బాల నటులను తమ అవసరాలకు ఉపయోగించడం బాల నాటకరంగ చరిత్రలో ఒక ఘట్టం అని చెప్పాలి. రెండవ ప్రపంచ యుద్ధం 1945లో ముగిసింది. 1947లో మనకు స్వరాజ్యం వచ్చింది. ఆ సంవత్సరములోనే మదరాసులో బాలల విజ్ఞాన వినోద వికాసములను పెంపొందించేందుకు పుట్టింది ఒక సంస్థ. అదే *ఆంధ్ర బాలానంద సంఘము.*

ఈ సంఘ నిర్వాహకులే పిల్లల కొరకు ప్రత్యేకంగా నాటికలు వ్రాయించి, వాటి ప్రదర్శనలకు అవకాశాలు కల్పించారు. ప్రతి దసరా ఉత్సవాలలోను పిల్లలకు నాటికల పోటీలు నిర్వహించి, ఉత్తమ రచనలకూ, నటులకూ, ప్రదర్శలకూ బహుమతులు ఇస్తూ వచ్చారు. *ఆంధ్ర దేశంలో బాల నాటకరంగ కళ* అనే ఉద్యమానికి ప్రప్రథమంగా కృషి చేసినది ఆంధ్ర బాలనంద సంఘమే అని చెప్పాలి. ఈ సంఘ కార్యకర్తలు తెలుగు జిల్లాల్లో పర్యటించి *బాలానంద సంఘముల* స్థాపనతో పాటు ఈ ఉద్యమానికి కూడా దారి చూపారు. వారి *బాల* పత్రిక కూడా ఈ ఉద్యమానికి ఎంతో దోహదం చేసింది. పిల్లల నాటికలనూ, ఫోటో చిత్రాలనూ, వార్తలనూ ప్రచురించి ప్రోత్సహించింది *బాల.*

*ఆంధ్ర బాలానంద సంఘము* 1952లో మదరాసు లోనూ, 1953లో కర్నూలులోనూ, 1955లో గుంటూరు లోనూ, 1957లో హైదరబాదు లోనూ నిర్వహించిన బాల మహా సభలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధి వర్గాలు ఆ సందర్భములో రాష్ట్రస్థాయిలో ఏర్పరిచిన సాంస్కృతిక కార్యక్రమములలో పాల్గొని బాల నాటక రంగము యొక్క ప్రాముఖ్యతనూ, ఆవశ్యకతనూ వెల్లడిపరచారు. బాలల నాటక ప్రదర్శనలు బాగుండాలంటే, వారికి ప్రత్యేకంగా అన్ని హంగులతో కూడిన ఒక రంగస్థలం అవసరం. ప్రత్యేక నాటికలు అవసరం అన్న విషయం గుర్తించ బడింది. పిల్లల కొరకు నాటికలు రచించడం అనుకున్నంత తేలిక పనికాదు. పిల్లల నాటికలు అంటూ అమ్ముడుపోతున్న నాటికల్లో స్టేజిమీద నటించుటకు అనువుగా ఉన్నవి బహు తక్కువ. వ్యాపార దృష్టితో కాకుండా పిల్లలు చూచుటకు యోగ్యంగా వుండే కథావస్తువుతోనూ స్టేజిమీద ప్రదర్శించేందుకు అనువుగా ఉండే నాటికలను ప్రదర్శించే ఔత్సాహికులు కూడా కావాలి.

గుంటూరు *బాలానంద కేంద్రం* వారు అనుభవం మీద *గంగిరెద్దు* మొదలగు నాటికలను వ్రాయించి ప్రదర్శించారు. హైదరాబాదులో కూడా *ఆంధ్ర బాలానంద సంఘం* వారు యీ కృషిని సాగిస్తున్నారు. ఇటీవల పిల్లల కొరకు ప్రత్యేకంగా నాటికలు వ్రాసి ప్రదర్శించిన వారిలో జమ్మలమడక పూర్ణచంద్ర రావు, చెరుకుమిల్లి భాస్కర రావుగారలను ఎన్నుకోవాలి. ఆకాశవాణి పిల్లల ప్రోగ్రాంలలో ఆది నుంచీ అనేక రకాల నాటికలు ప్రసారం అవుతూ వున్నాయి.

కౌండిన్య, రేడియో అన్నయ్య, అక్కయ్య, తాతయ్య, శ్రీవాత్సవ, ఏడిద, జనమంచి మొదలైనవారు రచించిన నాటికలలో కొన్నిటిని కొలది మార్పులతో బాలానంద సంఘాలు స్టేజిపై ప్రదర్శించారు. వీటిలో *బూరెల మూకుడు, ఇంటి మందు, జబ్బు కుదిరింపు, శ్రావణ భాద్రపదాలు, సింద్రిల్లా, పిల్లిమెడలో గంట, మెట్టెక్కితే, మహిషాసురమర్ధని, గ్రాంథిక శాస్త్రి, పొట్టిబావ-చిట్టి మరదలు* ఘనత వహించాయి.

బాలబాలికల శ్రేయస్సుకు, సాంస్కృతిక వికాసములకు తన జీవితమును అంకితము చేసిన విద్యావేత్త, కళావిదుడు, రచయిత రాఘవరావు (1905-84). 1939లో ఆలిండియా రేడియోలో పిల్లల ప్రోగ్రాముల నిర్వాహకుడుగా ఆయన

చేరారు. ఈ ఉద్యోగ నిర్వహణలోనే బాలల వికాసానికి ఒక సంస్థను రూపొందించాలనే ఆశయం ఆయనకు కలిగింది. సతీమణి కామేశ్వరితో కలిసి *బాలానంద సంఘాని* కి 1940లోనే ఆయన పునాదులు వేశారు.

రేడియోలో బాలల కార్యక్రమాలు, *బాల* పత్రిక, బాలానంద సంఘాల ద్వారా వారిరువురు చేసిన కృషి అవిస్మరణీయమైనది. రాఘవరావు రేడియో అన్నయ్యగాను, కామేశ్వరి రేడియో అక్కయ్యగాను సుప్రసిద్ధులయ్యారు. మన ఊహల్లో అపూర్వమయిన వాతావరణాన్ని కల్పించడమే కాకుండా ఆ కల్పనలో ఏనాడూ *హృదయం* వదలని అపూర్వమయిన ప్రసారకర్త అన్నయ్యగారు. ఆయన నాల్గయిదు తరాలకి అన్నయ్యగారు. ఆకాశవాణిలో బాలల కార్యక్రమాలకు రాఘవరావు దంపతులు మొత్తం 1000 స్క్రిప్టులు రూపొందించారు. వారు సృష్టించిన విశిష్ట పాత్రలలో *కొంటె క్రిష్టయ్య, తాతయ్య, మొద్దబ్బాయి, దొడ్డమ్మ, పొట్టిబావ - చిట్టి మరదలు* విశేష ఆదరాన్ని పొందాయి. మి

## అట్టమీది బొమ్మలు

**అట్టమీది బొమ్మలు** - *చిత్రకారిణి* : ఏలూరిపాటి అన్నపూర్ణ. యజ్ఞన్న శ్రీమతయిన ఈమె సహజ కళాకారిణి. ఆమె చిత్రాలలో ఎక్కడా ప్రసిద్ధి గాంచిన మరే చిత్రకారుని భావ వల్లరి కనిపించక పోవటం, సహజమైన ఆమె సృజనాత్మకతను మన ముందుంచుతాయి.




**ముఖచిత్రం** - శివపార్వతులు : 22" × 30" సైజులో కాన్‌సన్ కాగితంపై మిక్స్‌డ్ మీడియాతో గీసిన చిత్రమిది. శివపార్వతుల ఏకీకృత రూపమే అర్థనారీశ్వర మూర్తి. తన శరీరంలో అర్థభాగం తన పత్నియైన పార్వతికిచ్చి గౌరవించటం దీని కథాంశం. ఈ అర్థనారీశ్వర మూర్తి చిత్రం అనేకమంది ప్రసిద్ధి పొందిన చిత్రకారులు తమ చిత్రాలలో, తమదైన శైలిలో స్పందించారు. నందలాల్ బోసు వేసిన చిత్రం ఎంతో ప్రసిద్ధమైంది.



**రెండవ అట్ట** : మయూరి : 18" × 24" సైజులో కాన్వాస్ వస్త్రంపై కోడిగుడ్డు వృత్తాకారంలో రూపొందించిన భావనాత్మక చిత్రకళ. ఇందులో చిత్రకారిణి స్త్రీ మూర్తిత్వాన్ని ప్రకృతి ఒడిలో సందర్శించటం గమనించవచ్చు. అక్రిలిక్ రంగులతో బాటుగా వెండి చమ్కీ, తెలుపురంగులు అక్కడక్కడా అద్దబడటంతో చిత్రానికి కొత్త సొగసులు వచ్చి చేరాయి.



**మూడవ అట్ట** : పద్మ రాగం : 24" × 30" సైజులో ఈ పెయింటింగ్ మిక్స్‌డ్ మీడియా అయిన అక్రిలిక్ చార్కోల్ తో వేయబడ్డది చార్‌కోల్ ఉపయోగించటంలో కాన్వాసు మీద కానవచ్చే టెక్స్‌చర్‌ను మనం గమనించ వచ్చు.



**నాలుగవ అట్ట** : మౌన గానం : 20" × 28" సైజులో మిక్స్‌డ్ చార్కోల్ తో కలిపిన అక్రిలిక్ చిత్రం. ఇదీ కాన్వాసుపైన చిత్రించినదే...